క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాశికాంబ చంద్రశేఖర దేవస్థానంలో శ్రావణమాసం పురస్కరించుకొని మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. ఈఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే పూజలు నిర్వహించి చీర, ఒడి బియ్యం సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

రుద్రవరం: గ్రామాల్లోని ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదనరెడ్డి ప్రజలకు సూచించారు. ఎల్లావత్తుల, కోటకొండ గ్రామ సచివాలయాలను మంగళవారం ఆయన పరిశీలించారు. సచివాలయ సిబ్బంది పనితీరు, స్పందన రికార్డులను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కోటకొండలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని పరిశీలించి ఆధార్ అప్‌డేట్స్ సక్రమంగా చేయాలని సిబ్బందికి సూచించారు. అందుతున్న సేవల గురించి అక్కడికి వచ్చిన ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

గోస్పాడు: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఐదు, 15 ఏళ్ల చిన్నారుల వేలిముద్రల అప్‌డేట్ తప్పని సరిగా చేయించాలన్నారు.

నంద్యాల(అర్బన్): మండలంలోని పెద్దకొట్టాల, పుసులూరు గ్రామాల్లో ఆధార్ కార్డు సవరణ క్యాంపులు మంగళవారం ప్రారంభమయ్యాయని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. బుధవారం ఆయా గ్రామాల్లో కేంద్రాల ఏర్పాటు ఉంటుందని, ఆధార్ కార్డు దారులు తప్పొప్పులను సవరించుకోవాలని సూచించారు.

వైభవంగా స్వాతి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం స్వాతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకుడు రామ్మూర్తి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పట్టువస్త్రాలచే అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక కుంకుమార్చన నిర్వహించి మహామంగళ హారతులు, తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వాతి సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ అర్చకుడు రామ్మూర్తి పాల్గొన్నారు.

పంచాయతీకి రూ.50 వేల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): చేపల పెంపకం, అమ్మకాలకు సంబంధించి మిట్నాల పంచాయతీలోని చెరువు, శివరాంపురం కుంటలకు నిర్వహించిన వేలాల్లో మిట్నాల గ్రామ పంచాయతీకి రూ.50 వేల ఆదాయం వచ్చింది. స్థానిక గ్రామ పంచాయతీలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి అధ్యక్షతన చెరువు చేపల వేలం పాట నిర్వహించారు. డీఎల్‌పీఓ రాంబాబు, ఈఓఆర్‌డీ మహిదర్ రెడ్డి, సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డిల పర్యవేక్షణలో నిర్వహించిన వేలం పాటల్లో నలుగురు పాట దారులు పాల్గొన్నారు. చివరకు మాజీ సర్పంచ్ ఇప్పల చిన్న తిరుపతిరెడ్డి రూ.50వేలతో పాట దక్కించుకున్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్

గోస్పాడు: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం తన కార్యాలయంలో అంగన్‌వాడీ, సచివాలయ, వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎంపీడీఓ మాట్లాడారు. బాల్య వివాహాలు చట్టవిరుద్ధమన్నారు. స్త్రీలకు 18, పురుషులకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ పాల్గొన్నారు.

25న జాతీయ సదస్సు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 25న విజయవాడలోని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు డీవైఎఫ్‌ఐ నాయకులు శివ, లక్ష్మణ్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సదస్సులో నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాడాల్సిన అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

దిగుబడికి రాచ‘బాటలు’

- ఖరీఫ్ వరిసాగులో అవలంబిస్తే మేలు
- సుడిదోమ నివారణకు చక్కటి ప్రత్యామ్నాయం
- ఎరువులు, పురుగుమందుల వాడకానికి అనుకూల మార్గం



గడివేముల మండలం దుర్వేశి వద్ద పాయలతో కూడిన వరి పొలం

నంద్యాల(సెంట్రల్): ఖరీఫ్ వరిసాగులో కాలిబాటలు(పాయలు)గా పిలిచే సాగుపద్ధతికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ ప్రక్రియను వ్యవసాయ శాస్త్రవేత్తలు మూడు దశాబ్దాల క్రితం నుంచి సిఫారసు చేస్తున్నారు. ఫలితాలు కూడా అద్భుతంగా ఉన్నాయని పలువురు రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో తూర్పు పడమరగా, రబీ సీజన్‌లో ఉత్తర దక్షిణ దిశలుగా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 20 సెంటీమీటర్ల వెడల్పుతో ప్రతి రెండు మీటర్ల నిడివికి ఒకటి చొప్పున ప్రధాన పొలం అంతటా బాటలు తీయాలి. కాలిబాటలు తీసేటప్పుడు అక్కడ నాటిన మొనలు తగ్గిపోయి దిగుబడి తగ్గుతుందనే అపోహ ఇప్పటికీ పలువురు రైతుల్లో నెలకొంది. కానీ 20 సెంటీమీటర్ల ప్రాంతంలో తీసిన మొనలు పక్కనున్న ఖాళీల్లో నాటుతారు. కావున దిగుబడిపై ఎటువంటి ప్రతికూల ప్రభావాలు ఉండవు.

ఉపయోగాలివే..

- ఎంటపొలంలో అంతర కృషిచేసేందుకు, ఎరువులు వేయటానికి, పురుగుమందులు పిచికారీ చేసే సందర్భాల్లో బాటలు వీలుగా ఉంటాయి.
- పొలం విస్తీర్ణం అంతా సమాన పరిమాణంలో ఎరువులు, పురుగు మందులు చల్లటం సాధ్యపడుతుంది.
- సెప్టెంబర్ నెలాఖరునాటికి పూర్తిగా దుబ్బు చేసి వెన్ను అంకురం ఏర్పడే దశకు చేను వస్తుంది. ఆ దశలో వరి మొదలు నీటిమట్టం ఉండే ప్రదేశంలో గట్టిపడి తీపి ఎక్కువ అవుతుంది.
- కాలిబాటలు తీయకపోతే మొదలుభాగంలో చీకటిగా ఉండి వెలుతురు అందదు. ఆ ప్రదేశంలో మురుగునీరు బయటకు పోదు. దీనివల్ల చెడువాసనతో కూడిన వాతావరణం మొదళ్లలో ఉంటుంది. ఈ పరిస్థితిల్లో సుడిదోమ ఉధృతి పెరిగే అవకాశం ఉంటుంది. అటువంటి సమస్యలు రాకుండా ఉండేందుకు రైతులు నాట్లు వేసేటపుడే కాలిబాటలు(పాయలు) కనీసం పది రోజుల వ్యవధిలో తీసుకోవాలి.

‘రైతుల్లో ఆసక్తి ఉండాలి



సుడిదోమ నివారించటంలో ముందస్తుగా నాట్లు వేసినపుడే కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలనే ఆసక్తి రైతుల్లో ఉండాలి. అవసరమైతే ఇద్దరు కూలీలను అదనంగా పెట్టాల్సి ఉంటుంది. కానీ సుడిదోమ నివారణ, ఇతర ఉపయోగాలు పొందేందుకు కాలిబాటల ఏర్పాటు ఎంతో మంచి పద్ధతి.

– హేమసుందరరెడ్డి, సహాయ సంచాలకులు, నంద్యాల

20 ఏళ్లుగా ఇదే పద్ధతి

ఖరీఫ్ వరిసాగు పట్ల ఎంతో శ్రద్ధ పెడతాను. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు సలహాలు తీసుకుంటాను. ఏటా విత్తన మార్పిడి చేస్తుంటాను. 20 ఏళ్లుగా వరిలో కాలిబాటల పద్ధతిని పాటిస్తున్నా. నాటువేసినప్పుడే ముందుగా మార్కింగ్ ఇచ్చి కాలిబాటలు ఏర్పాటు చేస్తున్నాను. ఈ విధానంలో ప్రతి ఫలం కనిపిస్తోంది. – మోహన్, రైతు, గోరుకల్లు

దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో రెగ్యులర్ ఇంటర్ చదవలేని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన వారు ఈనెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

దొర్నిపాడు: విద్యుత్ వినిగదారులు భద్రతా ప్రమాణాలు పాటించాలని ఏఈ రామ్మోహన్ సూచించారు. మంగళవారం ఆయన సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి మాట్లాడారు. వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు ఐఎస్‌ఐ మార్కు ఉన్నవే ఉపయోగించాలన్నారు. స్విచ్ బోర్డులను పిల్లలకు అందనంత ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ వినియోగానికి సరిపడ వైర్లను మాత్రమే వాడాలన్నారు. ఇళ్లపై వెళ్లే వైర్లకు తప్పని సరిగా పైపులు ఏర్పాటు చేసుకోవడంతో పాటు దుస్తులు ఆరేసుకునే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. తడి చేతులతో స్విచ్‌లు, మోటార్లు ఆన్ చేయడం ప్రమాదకరమన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సొంతంగానో, ప్రైవేటు వ్యక్తులతోనే విద్యుత్ పనులు చేయించుకోవద్దని సూచించారు. పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు తాకకుండా 1912 నంబర్‌కు తెలియజేయాలన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి



పథకాల వివరాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సూచించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని ఎంవీ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ఎంత లబ్ధి చేకూర్చిందో వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని ప్రజలను కోరారు. చిన్న చిన్న సమస్యలుంటే అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. జగనన్న పాలనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): అన్ని వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్సార్ నగర్‌లో కౌన్సిలర్ సావిత్రమ్మ, వార్డు ఇన్‌చార్జ్ రమణల ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందని లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్ అందజేశారు. ఇంకా ఏమైనా సమ్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మబ్బున్నిసా, ఆప్కో డైరెక్టర్ సుబ్బారాయుడు వైఎస్సార్‌సీపీ నాయకులు అంకాలయ్య, బాబురావు, నరసింహరావు శెట్టి, తిరుపతయ్య, జాకీర్ హుసేన్, అన్వర్‌బాషా, రామకృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల పంపిణీ

వైఎస్సార్ నగర్‌లో 13 కుటుంబాలకు ఎమ్మెల్యే శిల్పా రవి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మంగళవారం తన ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు పట్టాలను అందజేసి మాట్లాడారు. పట్టణంలోని 5,500 ఇళ్ల స్థలాలను పేదలకు అందించేందుకు లే అవుట్లను సిద్ధం చేయగా వాటిపై ప్రతిపక్ష నాయకులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారన్నారు. పేదల వైపు ధర్మం ఉండటంతోనే కోర్టులలో కేసులు గెలిచి 3,006 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామన్నారు. మరో 12 మందికి త్వరలోనే ఇళ్ల పట్టాలను అందజేస్తామన్నారు.

గొర్రెల పెంపకం దారులకు అవగాహన



రైతులకు శిక్షణ పత్రం అందిస్తున్న దృశ్యం

రుద్రవరం: సాంకేతిక పరిజ్ఞానంతో గొర్రెల పెంపకం చేపట్టి అధిక లాభాలు గడించాలని ప్యాపిలి గొర్రెల పెంపకం దారుల శిక్షణా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్లు ఎంఎస్ రెడ్డి, గిడ్డయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం వివిధ మండలాల పశు వైద్యాధికారులు గొర్రెల పెంపకం దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్లు రైతులకు పలు సూచనలు ఇచ్చారు. గొర్రెల మందలో పిల్లల ఉత్పత్తి కోసం మేలైన పొట్టేళ్లను వదలాలని, కొంత కాలం అవ్వగానే వాటిని మార్చాలని సూచించారు. పిల్లలు పుట్టిన అరగంటలోపు పాలు పట్టాలని, వ్యాధులు సోకకుండా సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు మనోరంజన్ ప్రతాప్, జానకి, శ్రీనివాసులు, నాగప్రసన్న, దస్తగిరి తదితరులు ఉన్నారు.

సిమెంట్ రోడ్ల పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

శిరివెళ్ల: మండల కేంద్రంలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు మొదలయ్యాయి. మంగళవారం కెనరా బ్యాంక్ సమీపంలో రోడ్డు పనులకు సర్పంచు సాలమ్మ, ఎంపీపీ నాయక్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తమ కాలనీకి వచ్చినప్పుడు సిమెంట్ రోడ్లు కావాలని కోరామన్నారు. వారు స్పందించి రూ.60 లక్షల నిధులు విడుదల చేయించడంతో రోడ్డు వేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నాయక్ ముజాఫర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, దేవస్థానం చైర్మన్ తిమ్మరాయుడు, ఉప సర్పంచు ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా నిలయాలుగా సచివాలయాలు

- ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి
- ఎమ్మెల్యే శిల్పా రవింద్రకిశోర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): ప్రజలకు సేవా నిలయాలుగా సచివాలయాలు వ్యవహరిస్తున్నాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ సామాన్యుడు పలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అన్ని రకాల సేవలు ఒకే చోట పొందేలా, పాలన మరింత చేరువ అయ్యేలా సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షా యాభైవేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ ఆశయాలను సాధించేందుకు సచివాలయ సిబ్బంది కృషిచేయాలన్నారు. వార్డులలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పథకాలను ప్రజలకు చేరవేసే క్రమంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. అవసరమైన ధ్రువపత్రాలు ప్రజలకు చేరవేసేందుకు వీఆర్‌ఓలు కృషి చేయాలన్నారు. శానిటేషన్ మరింత మెరుగవ్వాలన్నారు. టౌన్ ప్లానింగ్ సెక్రటరీల అలసత్వంతో అక్రమ కట్టడాలు పెరిగిపోయాయన్నారు. ప్లాన్ డీవియేషన్, కాల్వలపై నిర్మాణాలను ప్రారంభంలోనే గుర్తించి అడ్డుకోవాలన్నారు. అన్ని వ్యవస్థలోని అన్ని విభాగాలు సమన్వయంతో ముందుకు పోతే సచివాలయ వ్యవస్థ దేశంలో చరిత్ర సృష్టిస్తుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, కో ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల చోరీ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులోని పొన్నాపురం కాలనీ సమీపంలో ఉన్న పాములేటి యోగాశ్రమం హుండీ కానుకలను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. తాలూకా సీఐ దస్తగిరిబాబు తెలిపిన వివరాలు.. సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు యోగాశ్రమంలోకి ప్రవేశించి హుండీ పక్కనే ఉన్న తాళాలతో హుండీని తెరిచి రూ.25 వేల నగదును అపహరించారు. ఆశ్రమ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): నూనెపల్లెకు చెందిన వృద్ధ బ్రాహ్మణులకు నవనంది రోటరీ క్లబ్ సభ్యులు మంగళవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ నరసింహులు, క్లబ్ అధ్యక్షుడు దీపక్, దాతలు అడ్డగాళ్ల వెంకటేశ్వర్లు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్యులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ నిధులు 18 శాతం మాత్రమే వస్తున్నాయన్నారు. సేవలను మెరుగు పరిచి ప్రైవేట్ నెట్వర్క్ ఆస్పత్రులకు దీటుగా వైద్యాధికారులు పని చేసి కనీసం 50 శాతం ఆరోగ్యశ్రీ నిధులు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ప్రతిరోజు ప్రసవాల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రులకు ఎంతమంది వస్తున్నారు, ప్రైవేట్ ఆస్పత్రులకు ఎంతమంది వెళ్తున్నారనే అంశాలపై ఆరా తీసి రోజువారి నివేదికలు పంపాలని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్లకు సూచించారు. ఏ కారణం చేత ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చిందనే అంశాలను ఆరా తీసి నివేదికలు ఇవ్వాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాలకు ఇబ్బందులు ఎదురైతే సామాజిక ఆరోగ్య కేంద్రాలకు, ఏరియా ఆస్పత్రులకు తరలించాలన్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడంతో పాటు ఆరోగ్య సిబ్బంది కొరత లేకుండా అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుందన్నారు. రోగులకు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు ఆరోగ్య మిత్రలు అనుసంధానకర్తలుగా వ్యవహరించి ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ అయిన ప్రతి పేషెంట్‌ను ఆరోగ్యశ్రీ కిందికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ కో ఆర్డినేటర్ జఫ్రుల్లా, జీజీహెచ్ సూపరింటెండెంట్ వరప్రసాద్, ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రూపేంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. మంగళవారం కళాశాల యాజమాన్యం చిన్నారులకు ప్రతి నెల రూ.25 వేల విలువ చేసే పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బయ్య, వైజేఆర్ కేర్ కర్నూలు కో ఆర్డినేటర్ సీపీటీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిబియ్యం పోసుకోకుండానే..

- మట్టి మిద్దె కూలి బాలింత మృతి
- మరొకరికి గాయాలు



మృతి చెందిన ప్రత్యూష

దొర్నిపాడు: పుట్టింటిలో ఒడి బియ్యం పోసుకుని అత్తారింటికి వెళ్లాల్సిన ఓ బాలింత ఆ కోరిక తీరకుండానే మృత్యు ఒడికి చేరిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మునేషుడు, నాగగుర్రమ్మ దంపతుల కూతురు ప్రత్యూష(21)ను స్వగ్రామంలోని బొబ్బిలి శంకరయ్యకు ఇచ్చి వివాహం చేశారు. పుట్టింటికి కాన్పుకు వచ్చిన ప్రత్యూష ఐదు నెలల క్రితం బాబుకు జన్మనిచ్చింది. బుధవారం ఒడి బియ్యం పోసుకోని అత్తారింటికి వెళ్లాల్సి ఉంది. ఈక్రమంలో మంగళవారం రాత్రి బాబును ఆరుబయట నిద్ర పుచ్చి, తల్లితో కలిసి ఇంట్లో పూజ చేసుకుంటుండగా మట్టి మిద్దె పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. స్థానికులు వెంటనే నాగ గుర్రమ్మను బయటకు తీశారు. మట్టి కింద ఇరుక్కున్న ప్రత్యూషను బయటకు తీసేలోపు ఊపిరాడక అపస్మారక స్థితికి చేరుకుంది. ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరణించారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ హనుమంతునాయక్, ఎస్ఐ తిరుపాల్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఐదు నెలల బాబు తల్లిని కోల్పోవడంతో ఇరుకుటుంబాల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

తాగు నీటి సమస్య రానివ్వొద్దు



సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: తాగు నీటి సమస్య రానివ్వొద్దని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల, బీసీ బాలికల, ఎస్సీ బాలుర వసతి గృహాల్లో తాగు నీటి సమస్యతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు శకుంతలారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఎంపీపీ స్పందిస్తూ విద్యార్థులకు ఇబ్బందులు కలిగించడం బాధాకరమని వెంటనే పైప్‌లైన్ మేర్పాటు చేయించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాల శిలాఫలకంలో తహసీల్దార్ పేరు తప్పనిసరిగా రాయించాలని సభలో తీర్మానించారు. సమావేశంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, ఏఓ సునీత, విద్యాధికారి అబ్దుల్‌కరీం, పంచాయతీరాజ్ ఏఈ కొండారెడ్డి, వైఎస్సార్ క్రాంతి పథం బాబు, హౌసింగ్ ఏఈ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వినియోగదారుల సమావేశం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల టెక్కె మున్సిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు షేక్ అబ్దుల్‌ఖాదర్ అధ్యక్షతన మంగళవారం పాఠశాల వినియోగదారుల క్లబ్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి నంద్యాల జిల్లా వినియోగదారుల అధ్యక్షులు న్యాయవాది సయ్యద్ అమీర్‌బాషా హాజరై విద్యార్థులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏవైనా వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తయారీ, గడువు తేదీలతో పాటు నిబంధనల ప్రకారం ఉందా లేదా అనేది చూడాలన్నారు.

పైలట్ కుటుంబానికి అండగా ఉంటాం

ఆళ్లగడ్డ: 108 వాహనం పైలట్ మురళీ(35) గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబానికి అండగా ఉంటామని ఏపీఎన్జీఓస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి మంగళవారం తెలిపారు. మురళీ చేసిన సేవలను ఆయన కొనియాడారు. ప్రభుత్వంతో మాట్లాడి ఆయన కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. మురళీ కుటుంబానికి 108 యూనియన్ రూ.10 వేలు, ఏఈఎంఎస్ రూ.10 వేలను అందజేశారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



గ్రామ దేవతలకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

చాగలమర్రి: మండలంలోని చిన్నబోధనం గ్రామంలో మంగళవారం వర్షం కోసం గ్రామ దేవతలు చౌడమ్మ, మైసూరమ్మ, పోతురాజులకు మహిళలు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా సరైన వర్షాలు లేకపోవడంతో చౌడమ్మ, మైసూరమ్మ దేవతలకు గ్రామోత్సవం నిర్వహించి వర్షాలు కురవాలని మొక్కుకున్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జున

గోస్పాడు: గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా సచివాలయాల మహిళా పోలీసులు చూడాలని ఎస్ఐ మల్లికార్జున సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.